క్లుప్తంగా

నేడు మహాలక్ష్మమ్మ జాతర



అంబాజీపేట: మాచవరంలో వేంచేసియున్న మహాలక్ష్మి అమ్మవారి జాతరను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి జాతరలో పూజఘటాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఆలయ ప్రాంగణం వద్ద శనివారం తీర్థం జరుగుతుందని ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అరిగెల నాగబాబు, నారిన శ్రీనివాసరావు తెలిపారు.

7న పొల్లమ్మ జాతర

మామిడికుదురు: ఈదరాడ గ్రామదేవత పొల్లమ్మ జాతర ఈ నెల 7వ తేదీ శుక్రవారం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ యెరుబండి శ్రీరామమూర్తి తెలిపారు. అమ్మవారి జాతర మహోత్సవాలు 7వ తేదీ నుంచి 10వ తేదీ ఆదివారం వరకు నాలుగురోజుల పాటు జరుగుతాయన్నారు. అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి జాతర పురస్కరించుకుని ఆలయాన్ని రంగులతో దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. విద్యుద్దీపాల కాంతులతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.

దాతల సహకారం మరువలేనిది



జి.అగ్రహారంలో పాఠశాలకు దాత అందించిన వంట పాత్రలు

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు అందిస్తున్న దాతల సహకారం మరువలేనిదని హెచ్‌ఎం ఎంఎస్ఎస్ కుమారి అన్నారు. గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన వంట పాత్రలను స్థానిక దాత కట్టా వెంకట సుబ్రహ్మణ్యం, సత్యనారాయణమ్మ దంపతులు, కుటుంబ సభ్యులు మంగళవారం పంపిణీ చేశారు. సుమారు రూ.17 వేలు విలువ చేసే వంట పాత్రలను హెచ్‌ఎం కుమారికి అందించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న దాతలను సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి, రాయుడు షణ్ముక్, మట్టపర్తి సూర్యనారాయణ, రాయుడు కృష్ణమహేష్, చిక్కాల వెంకటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు.

డిజర్ట్ ఫొటోగ్రఫీలో తృతీయ బహుమతి



రాజస్తాన్‌లో తృతీయ బహుమతి అందుకుంటున్న సీవీ రావు

మలికిపురం: రాజస్తాన్ రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన 11వ జేపీఎస్ డిజర్ట్ ఫొటోగ్రఫీ వర్క్‌షాపులో మలికిపురానికి చెందిన ఫొటోగ్రాఫర్ సీవీ రావు ఫొటోకు తృతీయ బహుమతి దక్కింది. వివరాలను ఆయన మంగళవారం తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి ఫొటోగ్రాఫర్స్ ఈ వర్క్‌షాపులో పాల్గొన్నట్టు, ఏపీ నుంచి తనకు ఈ గౌరవం దక్కినట్టు సీవీ రావు తెలిపారు.

వీరవల్లిపాలెంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్

అయినవిల్లి: వీరవల్లిపాలెంలో వివాదంలో ఉన్న రహదారిని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జి.వెంకటేష్, కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ మంగళవారం పరిశీలించారు. వివాదానికి కారణమైన విషయాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. గ్రామంలో సచివాలయ సిబ్బంది పనితీరుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.

నేడు వారపు సంత నిర్వహించవద్దు

అంబాజీపేట: అంబాజీపేట శివారు కొర్లపాటివారిపాలెంలో బుధవారం నిర్వహిస్తున్న వారపు సంతలో చెత్తను తొలగించని కారణంగా మార్కెట్ నిర్వహించవద్దని సోమవారం జరిగిన స్పందనలో అధికారులకు వినతి పత్రం అందజేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అలాగే సంతకు వచ్చే వ్యాపారులు, వినియోగదారులకు ముందస్తుగా తెలియపరిచేందుకు బ్యానర్లు ఏర్పాటు చేశామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను కూరగాయలు, చేప, మాంసం విక్రయాలు జరపనివ్వమని కొర్లపాటివారిపాలెం వాసులు చెబుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి జీవీవీఎస్ కుమార్‌ను వివరణ కోరగా బుధవారం జరిగే వారపు సంతలో కూరగాయల దుకాణాలు వేసుకోవచ్చని, ఎటువంటి మాంసం, చేపల విక్రయాలు జరపనివ్వమన్నారు. మాంసం, చేపల విక్రయాలు జరిపితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

వేతనాల పెంపుతో ఉపాధి కూలీలకు మేలు

- ఈ నెల 1 నుంచి రూ.272 వేతనం
- 42,800 మందికి ప్రయోజనం



కొబ్బరిచెట్ల చుట్టూ పళ్లాలు తవ్వుతున్న ఉపాధి కూలీలు

మామిడికుదురు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీల వేతనాలను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నిరుపేద కుటుంబాల్లో ఆనందం నింపింది. రెక్కాడితే కానీ డొక్కాడని ఎంతో మంది పేదలు ఉపాధి హామీ పథకంలో పనిచేస్తూ జీవనం పొందుతున్నారు. ప్రస్తుతం రోజుకు కూలీకి రూ.257 వేతనం చెల్లిస్తున్నారు. ఇక నుంచి దానికి అదనంగా మరో రూ.15 చెల్లించనున్నారు. ఈ పెంపు ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి వస్తుంది. తాజాగా పెంచిన వేతనం ప్రకారం కూలీకి రోజుకు రూ.272 వేతనం లభిస్తుంది. కూలీలకు పనులు లేక ఇబ్బంది పడుతున్న సమయంలో ఉపాధి హామీ పథకం కూలీలకు ఎంతో అండగా నిలుస్తోంది. ఈ పథకం ద్వారా పనులు చేస్తూ కూలీలు ఎంతో ఆనందంగా జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడు నియోజకవర్గాల్లో పరిస్థితి ఇదీ..

పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు 42,800 మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 17 వేల మంది, కొత్తపేట నియోజకవర్గంలో 17,500 మంది, రాజోలు నియోజకవర్గంలో 8,300 మంది కూలీలుగా నమోదయ్యారు. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వారిలో ఎక్కువ మంది నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కావడం గమనార్హం. వేతనాల పెంపుతో తమ జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని కూలీలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికి 100 రోజులు పని కల్పిస్తూ ప్రభుత్వం కూలీలకు ఎంతో అండగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో పని లేని సమయంలో పేద కుటుంబాలను ఆదుకునే దిశగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకం సత్ఫలితాలనిస్తోంది. తాజాగా వేతనాల పెంపుతో కూలీలకు ఆర్థికంగా మరింత ప్రయోజనం చేకూరనుంది.

మేలు జరుగుతుంది



రోజుకు రూ.15 వేతనాలు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల కూలీలకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ నిర్ణయంపై కూలీలంతా ఎంతో ఆనందంగా ఉన్నారు. మూడేళ్ల నుంచి ఉపాధిహామీ పథకం పనులు చేస్తూ మా కుటుంబంలో చాలా మంది ఉపాధి పొందుతున్నాం. పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా వేతనాలు పెంచడం ఎంతో మేలు చేస్తుంది.

– పొన్నమండ వెర్రియ్య, ఉపాధి కూలీ, పెదపట్నంలంక

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



ఉపాధి కూలీల వేతనాలు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి ఒక్క కూలీ స్వాగతిస్తున్నారు. దీని వల్ల ఎంతో మంది ప్రయోజనం పొందుతారు. ప్రస్తుతం ఇస్తున్న వేతనం రూ.257 కుటుంబ అవసరాలకు సరిపోవడం లేదు. అన్ని వస్తువుల ధరలు పెరిగిపోయాయి. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకుని రోజువారీ వేతాన్ని రూ.272 కు పెంచడం ఆనందంగా ఉంది.

– గోగి హేమలత, మేట్, బి.దొడ్డవరం

వేతనాల పెంపు మంచి పరిణామం



ఉపాధి కూలీల వేతనాలు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచి పరిణామం. వేతనాలు పెంచాలని చాలా కాలం నుంచి కూలీలు కోరుతున్నారు. దీనివల్ల మూడు నియోజకవర్గాల్లో 42 వేల మందికి పైగా కూలీలు ప్రయోజనం పొందుతారు. ప్రస్తుత వేసవి సీజన్‌లో ఉపాధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రెట్టించిన ఉత్సాహంతో పనిచేసేందుకు వేతనాల పెంపు దోహదపడుతుంది.

– మేడిది సీతారామ్, ఏపీఓ, మామిడికుదురు

మహిళలకు ఆసరాగా సీఎం జగన్



పోతవరంలో ఆసరా నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



శివకోటిలో మహిళలకు ఆసరా నమూనా చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక

పి.గన్నవరం: మహిళలకు సీఎం జగన్ ఆసరాగా నిలిచారని, ఆయన పాలనలో మహిళలంతా ఆర్థికాభివృద్ధి సాధించారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పోతవరంలోని లేఅవుట్‌లో మంగళవారం వైఎస్సార్ మూడో విడత ఆసరా పంపిణీ కార్యక్రమం జరిగింది. మండలంలోని 1515 డ్వాక్రా సంఘాలకు చెందిన 14,120 మంది మహిళలకు 11 కోట్ల 80 లక్షల 92 వేల 850 రూపాయల మూడో విడత ఆసరా సొమ్మును నమూనా చెక్కు రూపంలో చిట్టిబాబు అందజేశారు. మండలశాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర రావు అధ్యక్షతన జరిగిన సభలో చిట్టిబాబు మాట్లాడారు. మహిళలను లక్షాధికారులను చేస్తానని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీని జగన్ అమలు చేసారని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో జగన్ పనిచేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో మహిళలు జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేకు కట్ చేశారు. ఎంపీపీ అంబటి భూలక్ష్మి, తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ టీఎస్ వెంకటాచార్య, ఏఎంసీ చైర్‌పర్సన్ నక్కా కృష్ణవేణి, పార్టీ వాణిజ్య విభాగం నాయకుడు మంతెన రవిరాజు, కార్పొరేషన్ డైరెక్టర్ మద్దుల వరలక్ష్మి, ఏపీఓ మురళీకృష్ణ, సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, వడలి కొండ, కొంబత్తుల ఏసు, దొమ్మేటి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు ఆసరా

రాజోలు: మహిళల ఆర్థిక స్వావలంబన కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆసరాగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం శివకోటి కాపు కల్యాణ మండపంలో మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు రూ.11.48 కోట్లు నిధులు జమ చేశారు. ఎమ్మెల్యే రాపాక ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు, పార్టీ నాయకులు ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ మండలంలోని 11,489 స్వయం సహాయక సంఘాలకు మూడో విడతగా రూ.11.48 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందన్నారు. మహిళలను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు సీఎం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. ఆయన చేపట్టిన సామాజిక యజ్ఞంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ముందు వరుసలో నిలబెట్టారన్నారు. ఎంపీపీ కేతా శ్రీనివాస్, జెడ్పీటీసీ మట్టా శైలజ, రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి ఏస్తేరు రాణి, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడి దుర్గాభవాని, సర్పంచ్‌లు నక్కా రామారావు, రేవు జ్యోతి, కుక్కల బేబికుమారి, బత్తుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిలో పయనిస్తోంది



కలెక్టర్ హిమాన్షు శుక్లాను శాలువాతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: నూతనంగా ఏర్పడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కృషితో అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఉద్ఘాటించారు. కొత్త జిల్లా ఏర్పడి విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుని రెండో ఏట అడుగుపెట్టిన సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే చిట్టిబాబు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను అమలాపురంలో ఆయన కార్యాలయంలో కలిశారు. కలెక్టర్‌ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తూ జిల్లాను ప్రగతిపథంలో నడిపిస్తున్నారని మెచ్చుకున్నారు. ఇదే ఉత్సాహంతో పని చేస్తూ అభివృద్ధిని మరింత పరుగులు పెట్టించాలని ఎమ్మెల్యే చిట్టిబాబు అభిలషించారు.

విద్యార్థులకు రుచికరంగా వండాలి

కొత్తపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులందరూ సంతృప్తిగా తినేలా మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా, నాణ్యతగా వండాలని జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం తీరుతెన్నులను జెడ్పీటీసీ సభ్యురాలు రమాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట, వడ్డింపుతో పాటు భోజనాన్ని ఆమె రుచి చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలా అయితే ఎలా? అంటూ భోజనంలో నాణ్యత లోపాన్ని గురించి ఏజెన్సీ నిర్వాహకురాలిని ప్రశ్నించారు. ఏదో మొక్కుబడిగా వండి, వడ్డించడం సరికాదు కదా? అని హితవు పలికారు. పాఠశాలలో విద్యార్థులందరూ సంతృప్తిగా భోజనం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పోషక విలువలతో కూడిన మెనూ అమలు చేస్తుందన్నారు. ఇకపై వంటలో తగిన మెళకువలు తెలుసుకుని వండాలని రమాదేవి సూచించారు. పథకం నిర్వహణను ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. నాణ్యత లేమిపై నిర్వాహకురాలికి అధికారులు నోటీసు ఇచ్చారు. ఈ తనిఖీలో ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, హెచ్‌ఎం క్రిస్టఫర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదరికమే ప్రామాణికంగా పథకాల అమలు



రామరాజులంకలో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: పేదరికమే ప్రామాణికంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం రామరాజులంక చర్చిపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. అలాగే అర్హులైన పేదలు ఇంకా మిగిలి ఉంటే అక్కడికక్కడే అధికారులకు పథకాలు మంజూరుకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి సీఎంగా జగన్‌ని గెలిపించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. మేడిచర్ల వెంకట్రాజు, చొప్పల రాజేశ్వరరావు, నల్లి బాలకృష్ణ, నల్లి శివకుమార్, చింతా రాజబాబు, రావి గోపాలం, ముత్యాల దొర, దేవ దానియేలు, చొప్పల రాజశేఖర్, ఈద అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

మలికిపురం: ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం కార్యకర్తలపై ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు అన్నారు. మంగళవారం మలికిపురంలో సీపీఐ నియోజకవర్గ స్థాయి సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఏప్రిల్ 14 నుంచి 30 వరకూ సీపీఐ, సీపీఎం పార్టీలు చేపట్టిన రాజకీయ ప్రచార ఉద్యమ భేరి కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'ను విజయవంతం చేయాలి

పి.గన్నవరం: ఈనెల 7 నుంచి జరుగనున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పార్టీ శ్రేణులకు సూచించారు. మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం పోతవరంలో నియోజకవర్గంలోని సచివాలయాల కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. పార్టీ అధిష్ఠానం నిర్దేశించిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందించేందుకు కృషి చేయాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం సచివాలయ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని చిట్టిబాబు సూచించారు. కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, మండల జేసీఎస్ కన్వీనర్లు దొమ్మేటి దుర్గారావు, జక్కంపూడి వాసు, పులిదిండి ప్రభాకర్, దొమ్మేటి సత్యమోహన్, మండల పార్టీ అధ్యక్షుడు కొమ్ముల రాము, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, కుసుమ శ్రీధర్, ఎం.ప్రశాంత కుమార్, పితాని నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

దోషులపై చర్యలు తీసుకోవాలి

మామిడికుదురు: తన ఫొటోతో ఏర్పాటు చేసిన స్వాగతం బోర్డుపై స్టిక్కర్లు అతికించి అవమానించిన దోషులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి నగరం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపుతో పాటు పలువురు సర్పంచ్‌లు నగరం ఎస్సై షేక్ జానీబాషా, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ శరణ్యను కలిసి ఫిర్యాదు చేశారు. మాజీ జెడ్పీటీసీ చైర్మన్ నామన రాంబాబుతో పాటు టీడీపీ నేతలు కూడా సర్పంచ్‌తో పాటు ఆమె సోదరుడు జాలెం సుబ్బారావును బెదిరిస్తూ అవమానిస్తున్న దోషులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నగరం పోలీసులకు, ఎంపీడీఓకు, తహసీల్దార్‌కు విడిగా మరో ఫిర్యాదు అందజేశారు.

చివరికి గట్టెక్కింది

- ముందస్తు దాళ్వాతో సత్ఫలితాలు
- గట్టెక్కిన దాళ్వా
- శివారుకూ పూర్తి స్థాయిలో సాగునీరు



రామరాజులంకలో మాసూళ్లకు సిద్ధమవుతున్న వరి పైరు

మలికిపురం: రాజోలు దీవిలో ముందస్తు దాళ్వా సాగుతో సత్ఫలితాలు వచ్చాయి. గతేడాది నవంబరు నెలలోనే దాళ్వా సాగు ప్రారంభించిన రైతాంగానికి అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సహకరించడంతో నీటిఎద్దడి లేకుండా రైతాంగం గట్టెక్కింది. గత సార్వా సాగుకు వాతావరణం అనుకూలించక పోవడం, గత ప్రభుత్వాల నిర్వాకం వల్ల డ్రెన్లు అధ్వానంగా ఉండడం వంటి కారణాలతో గత ఐదేళ్లుగా సార్వా సాగును రాజోలు దీవి రైతాంగం చేపట్టడం లేదు. దీనికి తోడు గడచిన వర్షాకాలంలో వర్షాలకు తోడు, వరదలు కూడా అధికంగా ఉన్నాయి. దీంతో ముంపు కిందికి దిగక రైతాంగం సతమతం అయింది. ఈ కారణంగా కూడా రైతులు భయపడి సార్వా సాగుకు సాహసం చేయలేకపోయారు. నాట్లు వేసిన రైతులు నష్టపోయారు. కాగా అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రాజోలు, పి.గన్నవరం, అమలాపురం, ముమ్మిడివరం వ్యవసాయ డివిజన్‌లలో దాళ్వా సాగు మిగిలిన మెట్ట ప్రాంతాల వ్యవసాయ డివిజన్లతో పోలిస్తే ఆలస్యంగా ప్రారంభం అవుతాయి. ఇక్కడ నీటి విడుదల ఆలస్యంగా ఉండడం వల్ల ఇలా జరుగుతుంది. ఈ కారణంగానే రాజోలు దీవిలో ప్రతి ఏడాది దాళ్వా సాగు మాత్రం జనవరి తర్వాతే చేపట్టేవారు. అయితే ఈ సారి సార్వా 80 శాతం వేయకపోవడం, ప్రస్తుత ప్రభుత్వం వ్యవసాయానికి అన్ని విధాలుగా అందిస్తున్న సహకారంతో రైతులు ఉత్సాహంగా దాళ్వా సాగు చేసుకుంటున్నాయి. దీంతో ముందస్తు దాళ్వా సాగుకు గత ఏడాది నవంబరు నెలలోనే శ్రీకారం చుట్టారు. రాజోలు దీవిలో పూర్వం నుంచీ దాళ్వా కంటే సార్వా పంట సాగే అధిక విస్తీర్ణంలో సాగయ్యేది. వైపరీత్యాల ఇబ్బందులు ఉన్నా సార్వా సాగుకు రైతులు ఉత్సాహంగా ముందుకు వెళ్లేవారు. దీనికి కారణం సార్వా సాగుకు సాగునీటి కొరత అనేది ఉండదు. భారీ వర్షాల వల్ల తెగుళ్ల బెడద కూడా అంతగా ఉండేది కాదు. దాళ్వా సాగులో కాలువ శివారు భూములకు నీరు అందడంలో ఇబ్బందులు ఉంటాయి. పైగా వర్షాలు ఉండవు. ఇటువంటి పరిస్థితుల్లో సార్వా సాగుపై రైతులు విరక్తి చూపడం వల్ల ప్రస్తుతం దాళ్వా సాగు ఉత్సాహంగా చేశారు. 2018 సంవత్సరానికి ముందు రాజోలు వ్యవసాయ సబ్ డివిజన్‌లో సఖినేటిపల్లి మండలంలో సుమారు 7500 ఎకరాలు, మలికిపురం మండలంలో సుమారు 3 వేల ఎకరాలు, రాజోలు మండలంలో సుమారు 7600 ఎకరాల్లో వరిసాగు జరిగేది. అయితే ఆక్వా సాగు విస్తీర్ణం మరింత పెరగడం వల్ల సఖినేటిపల్లి మండలంలో 5,500, మలికిపురం మండలంలో 2500, రాజోలు మండలంలో 5,500 ఎకరాలకు వరి సాగు విస్తీర్ణం పడిపోయినట్లు వ్యవసాయ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. గత సార్వాలో రాజోలు మండలంలో 560 ఎకరాలు, మలికిపురం మండలంలో 200 ఎకరాలు, సఖినేటిపల్లి మండలంలో 5 ఎకరాల్లో మాత్రమే సార్వా సాగు జరిగింది. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న చర్యల నేపథ్యంలో శివారు భూములకు సైతం నీటి సరఫరా మెరుగయింది. దీంతో మొత్తం రాజోలు దీవిలో రాజోలు మండలంలో 90 శాతం, మలికిపురంలో 70 శాతం వరి చేలలో నాట్లు పడ్డాయి. ఆక్వా ప్రభావం పెరగడం వల్ల, సఖినేటిపల్లిలో ఈ ఏడాది 1600 ఎకరాల్లో వరి సాగు జరిగింది.

మరో వారం రోజుల్లో మసూళ్లు

కాగా దాళ్వా సాగు చివరి దశకు చేరుకోవడంతో రాజోలు దీవిలో రైతులు వరి చేల మసూళ్లకు సిద్ధమవుతున్నారు. వారం రోజుల్లో 30 శాతం వరి చేలు, మరో రెండు వారాల్లో మిగిలిన 70 శాతం వరి చేలు కోతలు ప్రారంభం అవుతాయి.

మెరుగైన ఫలితాలు



ముందస్తు దాళ్వా సాగు వల్ల రైతులకు చాలా మేలు జరిగింది. ప్రధానంగా శివారు భూములకు సైతం సాగు నీటి కొరత లేదు. ఈ సారి తెగుళ్ల నివారణకు సైతం రైతును అన్ని విధాలుగా శిక్షణ ఇచ్చి ఇష్టానుసారం ఎరువులు వాడకుండా జాగ్రత్తలు తీసుకున్నాం.

– ఎస్.రాకేష్, వ్యవసాయ శాఖ ఏవో, మలికిపురం

బాలల హక్కుల రక్షణకు కృషి చేయాలి

ఆలమూరు: బాలబాలికలు, చిన్నారుల అభ్యున్నతికి, మానవహక్కుల పరిరక్షణకు అందరూ కృషి చేయాలని పారా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ జి.చిన్నదుర్గ అన్నారు. ఆలమూరులోని ఎస్టీ ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ వి.సరోజారాణి ఆధ్వర్యాన నిర్వహించిన బాలల హక్కుల రక్షణపై మహిళలకు అవగాహన సదస్సు జరిగింది. బాల్య వివాహాలు నిరోధించాలని, బడి ఈడు పిల్లలను బడికి పంపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి ఎస్.నీలిమ, పారా సంస్థ ప్రతినిధులు నల్లా సూర్యప్రకాష్, దుర్గాప్రసాద్, సాయిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను పూర్తి చేయాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని వైద్యాధికారి పి.భవానీశంకర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్యారోగ్య, ఆశ సిబ్బందికి సమావేశం జరిగింది. ఏప్రిల్‌లో సాధించవలసిన ప్రగతిని అధికారులు వివరించారు. గ్రామ సచివాలయాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను వివరించి ఆరోగ్య సేవలపై పలు సూచనలు, సలహాలను అందజేశారు.

వైఎస్సార్ సీపీలో భారీ చేరికలు



కలవచర్లలో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని కలవచర్లలో మంగళవారం కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో భారీ చేరికలు జరిగాయి. గ్రామ కమిటీ అధ్యక్షుడు కురుపూడి లోవ సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామ జనసేన అధ్యక్షుడు సూతంశెట్టి వెంకటరావుతో పాటు ప్రతిపక్ష పార్టీలకు చెందిన గుంటూరి గోవిందు, గుత్తుల వీరేంద్ర, వనుం అర్జున్ తదితర 150 మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సీఎం జగన్ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గ అభివృద్ధికి, పేద ప్రజల అభ్యున్నతికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేస్తున్న కృషికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, టి.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ది జనం మెచ్చిన పాలన

అయినవిల్లి: రాష్ట్రంలో జనం మెచ్చిన పాలనను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మంగళవారం అయినవిల్లి మండలం నల్లచెరువులో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రజలను సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి అర్హత పరిశీలించి పథకాలను అందిస్తున్నారన్నారు. గ్రామంలో సమస్యలను తర్వతగతిన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, సర్పంచుల మండల సమాఖ్య అధ్యక్షురాలు వార జయసావిత్రి, నేదునూరు గ్రామ సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, శీలం వేంకటేశ్వరరావు, గుత్తుల నాగబాబు, వార లక్ష్మీనారాయణ, మట్టపర్తి రామారావు, జోగి బాబ్జి, దాసరి నటరాజు వివిధ గ్రామాల అధికారులు పాల్గొన్నారు.